ప్రజాశక్తి

ఆదివారం 14 జులై 2024

జిల్లా ఎస్‌పిగా ఎస్‌వి మాధవరెడ్డి

విక్రాంత్ పాటిల్‌కు కాకినాడ బదిలీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మన్యం జిల్లా ఎస్‌పిగా ఎస్‌వి మాధవరెడ్డి రానున్నారు. మాధవరెడ్డి శ్రీ సత్యసాయి జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. ఈయన 2017 ఐపిఎస్ బ్యాచ్ చెందిన వారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్‌పిగా పనిచేస్తున్న విక్రాంత్ పాటిల్‌కు కాకినాడ జిల్లా బదిలీ అయ్యింది. విక్రాంత్ పాటిల్ జిల్లా ఎస్‌పిగా 15 నెలలు పాటు పనిచేశారు.

చదివేది... నిద్రించేది అక్కడే

- వసతి సమస్యలతో అవస్థలు
- 6, 11 తరగతుల విద్యార్థులు ఇళ్లకే పరిమితం
- ఇదీ ఏకలవ్య పాఠశాల దుస్థితి

ప్రజాశక్తి -మక్కువ

చదువుకున్న చోటే నిద్రించాల్సిన పరిస్థితి అక్కడి విద్యార్థులకు దాపురించింది. చాలీచాలని గదులతో ఆవస్థలుపడక తప్పడం లేదు. ప్రవేశం కల్పించిన 6,11 తరగతుల విద్యార్థులకు పాఠశాల మొఖం చూసే అదృష్టం కూడా లేదు. ఇదీ మండలంలోని ఎర్ర సామంతవలస ఆశ్రమ పాఠశాలలో ఆశ్రమం పొందుతున్న ఏకలవ్య మోడల్ పాఠశాల విద్యార్థుల దుస్థితి.

మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ అనసభద్ర సమీపాన 2020లో ఏకలవ్య పాఠశాలకు శంకుస్థాప జరిగింది. నేటిక నాలుగేళ్లయినా ఇప్పటికీ భవన నిర్మాణ పనులు పూర్తి కాలేదు. దీంతో ఎర్ర సామంతవలస ఆశ్రమ పాఠశాలలో కొన్ని గదుల్లో ఆశ్రమం పొందుతూ ఏకలవ్య పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో సుమారు 245 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ ఏడాది 6,11 తరగతులకు ప్రవేశాలున్నప్పటికీ వారిని చేర్చుకొని ఇంటికే

నిర్మాణంలో ఉన్న ఏకలవ్య పాఠశాల

బాత్రూంలోకి నీళ్లు తీసుకెళ్తున్న విద్యార్థులు

పరిమితం చేయాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఇప్పటికే విద్యార్థులు ఇరుకు గదుల్లో ఇబ్బందులుపడుతూ విద్యను అభ్యసిస్తున్నారు. అలాగే మరుగుదొడ్లు కూడా తక్కువ ఉండడంతో విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. గత ప్రభుత్వ హయాంలో డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర పాఠశాలలో కొన్ని భవనాలను ప్రారంభించి ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థులకు కొన్ని గదులనైనా పూర్తి చేసి విద్యా సంవత్సరానికి అందించాలని అప్పట్లో కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కానీ ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. అలాగే భవనాలు ఒకవేళ అప్పగించినా తాగునీటి పరిస్థితి కూడా అగమ్య గోచరంగానే ఉంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి ఏకలవ్య పాఠశాలలో చేరే గిరిజన విద్యార్థులను ఆదుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉత్తరాది సిబ్బందితో విద్యార్థులకు అవస్థలు

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఏకలవ్య పాఠశాలకు దాదాపుగా 18 మంది టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందిని ఉత్తరాది రాష్ట్రాల నుండి ఇక్కడకు బదిలీ చేశారు. దీంతో వారు మాట్లాడే భాష విద్యార్థులకు అర్థం కాక, అలాగే విద్యార్థులు మాట్లాడే భాష వారికి అర్థం కాక నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో భాషా పరిజ్ఞానంపై విద్యార్థులకు కొంత మేరకు శిక్షణ ఇచ్చినప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు.

ఆశ్రమ పాఠశాలలో ఆ'శ్రమ' తప్పడం లేదు

మండలంలోని ఎర్ర సామంతవలస ఆశ్రమ పాఠశాలలో సుమారు 324 మంది బోర్డర్ విద్యార్థులు, 83 మంది నాన్ బోర్డర్ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికీ సుమారు 20 మరుగుదొడ్లు ఉన్నాయి. అయితే వాటికి నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు మరుగుదొడ్లకు వెళ్లాలంటే దూరం నుంచి నీళ్లు తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సమస్యపై ఇన్చార్జ్ ప్రిన్సిపల్ మరడ శ్రీనివాసరావును వివరణ కోరగా ప్రస్తుతం వాటర్ పైపులు మరమ్మతుకు గురైనందున బాగు చేస్తున్నామని తెలిపారు.

జిపిఎస్‌పై భగ్గుమన్న ఉపాధ్యాయులు

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఆందోళన • గెజిట్ కాపీలు దగ్ధం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి ముందు రోజే జిపిఎస్ అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గమని యుటిఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.మురళి, ఎస్.మురళీమోహన్‌రావు అన్నారు. జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి, సదరు గెజిట్ కాపీలను దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్థిక కార్యదర్శి రావత్ జీవో 54ను జూన్ 12న నోటీపై చేయడం అత్యంత దారుణ మన్నారు. పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలన్నదే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్ష అని చెప్పారు. గత ప్రభుత్వం జిపిఎస్‌ను అమలు చేసేందుకు ప్రయత్నించిందని, పోరాటాల ఫలితంగా తాత్కాలికంగా జిఒను విడుదల చేయలేదని గుర్తు చేశారు. ఇప్పుడు పాత తేదీతో జిపిఎస్ అమలు చేస్తూ గెజిట్ విడుదల చేయడం దుర్మార్గమని, ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసపుచ్చడమేనని విమర్శించారు. ఈ గెజిట్‌ను వెంటనే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 37ను తక్షణం అమలు చేసి 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులను పాత పెన్షన్ విధానంలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు టి.రమణ, ఎం.శ్రీను, వి.జ్యోతి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిపిఎస్ ప్రతులను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

మంత్రి సంధ్యారాణికి వాలంటీర్ల వినతి

ప్రజాశక్తి- సాలూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని వాలంటీర్లు శనివారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ని కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి సంధ్యారాణిని ఆమె నివాసంలో కలిసి సమస్యల్ని వివరించారు. వైసిపి ప్రభుత్వం హయాంలో తాము 5వేల రూపాయల వేతనానికే ప్రజలకు అనేక సేవలు అందించామని చెప్పారు. తమ వేతనాన్ని 5వేల నుంచి పదివేలకు పెంచుతామని,సేవలు కొనసాగిస్తామని టిడిపి కూటమి ప్రభుత్వ పెద్దలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు ఎన్నికల ముందు హామీ ఇచ్చారని చెప్పారు. ఆ హామీలను నిలబెట్టుకోవాలని కోరారు.

హెల్త్ వాలంటీర్ల వినతి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హెల్త్ వాలంటీర్లు శనివారం గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో తమను నియమించాలని కోరారు. నియామకాల్లో హెల్త్ వాలంటీర్‌లకు ప్రాధాన్యత ఇస్తామని మంత్రి సంధ్యారాణి వారికి హామీ ఇచ్చారు.

మంత్రి సంధ్యారాణికి వినతిని అందజేస్తున్న వాలంటీర్లు

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్, మాజీ డిప్యూటీ సిఎం

'సమిష్టిగా పనిచేద్దాం'

ప్రజాశక్తి- సాలూరు

రానున్న రోజుల్లో వైసిపి నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర కోరారు. శనివారం విజయనగరంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు నివాసంలో సాలూరు, పాచిపెంట మండలాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ ఆయన ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడే ధైర్యంగా నిలబడాలని సూచించారు. పార్టీ ఓటమికి కార్యకర్తలు ఎవరూ కుంగిపోవద్దని, నాయకత్వం అండగా వుంటుందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన నెలరోజులకే టిడిపి ప్రభుత్వం అరాచకాలకు తెరలేపిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని సూచించారు. మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర మాట్లాడుతూ ఇప్పుడున్న టిడిపి ప్రభుత్వం హయాంలో నాయకులు హామీ ఇచ్చినట్లుగా సంక్షేమ, అభివృద్ధి పనులు జరిగితే మంచిదేనని, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తే పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. ఈ సమావేశంలో పాచిపెంట మండల సీనియర్ నాయకులు పాచి పెంట చినబాబు, డోల బాబ్జీ, టి. గౌరీశ్వరరావు, జెడ్‌పి వైస్ చైర్మన్ కె. సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వారం ముందే సాగునీరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గత ఏడాది ఖరీఫ్ సీజనకు సంబంధించి జులై మూడో వారంలో నీటిని విడుదల చేయగా ఈ ఏడాది వారం రోజులు ముందుగానే సాగునీటిని విడుదల చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర వద్ద గల తోటపల్లి జలాశయం నుంచి పాత ఎడమ, కుడి కాలువ నీటిని శనివారం ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కాలువ ద్వారా 39 వేల ఎకరాలకు సాగునీరందుతుందని తెలిపారు. గత ఏడాది మోడరైజేషన్‌లో భాగంగా రూ.153 కోట్లతో పనులు చేపట్టగా ఇప్పటికి 22శాతం పనులు పూర్తి చేశామని డిఇఇ రవికుమార్ తెలిపారు. వాస్తవానికి 30మంది లస్కర్లు పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం ఆరుగురు మాత్రమే పనిచేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కాలువ గుండా గరుగుబిల్లి, జియ్యమ్మవలస, వీరఘట్టం, పాలకొండ, బలిజిపేట, వంగర మండలాలకు నీరు అందుతున్నారు.

ఐదేళ్లలో సకాలంలో నీరు లేక ఇబ్బందులు

వివిధ మండలాలకు చెందిన రైతులు గత ఐదేళ్లలో ఎన్నడూ సకాలంలో సాగు నీరందించిన దాఖలాల్లేవని, గడిచిన ఐదేళ్లలో ఎప్పుడూ రెండు పంటలకు నీరందించిన దాఖలాలు లేవని అధికారులను రైతులు నిలదీశారు. ఎప్పుడు అడిగినా ఏదో ఒక కారణం చెప్పుకొస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు అధికారులు స్పందిస్తూ కాంట్రాక్టర్లు సకాలంలో పని చేయకపోవడం వల్ల రైతులకు నీరందించే విషయంలో జాప్యం జరిగిందని పేర్కొన్నారు. వంగర మండలానికి సంబంధించిన రైతులు ఈ కాలువ నుంచి తాము లబ్ధి పొందిన దాఖలాల్లేవని, ప్రస్తుత ప్రభుత్వమైనా తమకు సక్రమంగా సాగునీరందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదన్, మర్రాపు పురుషోత్తమనాయుడు, అంబటి రాంబాబు, కోట సుమన్‌రావు, రామ్మూర్తి, పి.పాపినాయుడు, ద్వారపురెడ్డి సత్తిబాబు, పూర్ణచంద్రరావు, ఎఇఇలు కె.రాజేష్‌కుమార్, బి.శంకర్రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ వి.గౌరినాయుడు, లస్కర్ టి.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా, టైఫాయిడ్, తదితర వైరల్ జ్వరాలు అధికంగా ఉన్నాయని, విష జ్వరాలు ఉన్నచోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఫోన్లో కోరారు. శనివారం ఆయన స్థానిక ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. రోగులను వైద్యం ఏ విధంగా అందుతుందీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అలాగే డిఎంహెచ్ఒ విజయ పార్వతితో ఫోన్లో మాట్లాడారు. ఏజెన్సీలో జ్వరాలు అధికంగా ఉన్నాయని వైద్యులు అందుబాటులో ఉండాలని కోరారు. అలాగే జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఏరియా ఆసుపత్రిలో ప్రతి వార్డు తిరిగి రోగులతో మాట్లాడారు. జ్వరాలు గురించి ఆరా తీశారు. అనంతరం. ధోనిబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఎమ్మెల్యేతో పాటు ఐటిడిపి ఇన్‌ఛార్జి హిమరక పవన్, మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొఖలింగం, టిడిపి నాయకులు హెచ్.ప్రసాద్, మాజీ ఎంపిపి ఎస్.మాలయ్య వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

గడ్డి మందు తాగి రైతు మృతి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

విజయనగరం జిల్లా వంగర మండలం పెద్ద రాజుల గుమ్మడ గ్రామానికి చెందిన రైతు రెడ్డి కృష్ణమూర్తి (46) మృతి చెందాడు. శనివారం తన పొలంలో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో ఉండడాన్ని చూసిన ఆయన సోదరుడు రెడ్డి కూర్మినాయుడు 108 వాహనంలో పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం విశాఖకు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

సీతంపేటలో రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను సోమ వారం సీతంపేటలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీతంపేట ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, కావున జిల్లా ప్రజలు తమ సమస్యలు సమర్పించవచ్చని ఆయన తెలిపారు.

బిల్లబంద ఏదీ?

అనధికార లే అవుట్లపై చర్యలు సున్నా...

లేఅవుట్లను పరిశీలించిన సిపిఎం పట్టణ కమిటీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణ నడిబొడ్డులో ఉన్న బిల్లబంద జాడ ఎక్కడ ఉందో రెవెన్యూ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు చెప్పాలని సిపిఎం పట్టణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో గల సౌందర్య నారాయణమూర్తి నగర్ (ఎస్ఎన్ఎం)కు, పరమేశ్వరి లే అవుట్‌కు మధ్యన బిల్లబందలో వెలసిన లే అవుట్‌ను పట్టణ సిపిఎం కార్యదర్శి గొర్లి వెంకటరమణ, కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమా మహేశ్వర రావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ తాము పరిశీలించిన లే అవుట్ మున్సిపాలిటీ వారి అనుమతుల్లేవని, బిల్ల బందను కప్పేసి లే అవుట్ వేశారని పలు పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు లక్షలాది రూపాయలు అందాయని కనుకనే మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరించారని చర్చ పట్టణ ప్రజల్లో జరుగుతుందని, ఇందులో భాగంగా తాము ఈ పరిశీలన చేశామని వారన్నారు. సర్వే నెంబరు-119/12 లో 88 సెంట్లు విస్తీర్ణంలో బిల్లబంద ఉందన్నారు. అలాగే గోపసాగరం చెరువు నుండి, బిల్లబంద గోర్జ సర్వే నెంబరు 123 లో 32 సెంట్లు, 124 లో 54 సెంట్లు, మొత్తం ఎకరా 74 సెంట్లు విస్తీర్ణం గల ప్రభుత్వ భూమి మాయమైందన్నారు. ప్రభుత్వ భూమి కాపాడాల్సిన అధికారులు ఈ భూమి ఎక్కడ ఉందో చూపించాలని డిమాండ్ చేశారు. ఈ బంద ఆక్రమణలపై త్వరలో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అభిమాని చొక్కాపు వెంకటరమణ పాల్గొన్నారు.

బిల్లబందలో ఉన్న అనధికార లేఅవుట్లను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

డబుల్ ఇంజిన్ సర్కారులో టోల్‌ఛార్జీ బాదుడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటే అభివృద్ధిలో మరింత దూసుకుపోతామంటూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగాలు మర్చిపోక ముందే జిల్లాలో టోల్‌గేట్ ఛార్జీల బాదుడు మొదలైంది. వారు వీరు అన్న తేడా లేదు. జిల్లాలోని ప్రతి ప్రయాణికుడూ ఇంటి నుంచి బయటకు వస్తే టోల్ బాదుడు తప్పదు. మోడీ చెప్పిన అభివృద్ధి జరుగుతుందో లేదో తెలియదుగానీ డబుల్ ఇంజిన్ సర్కారు రావడం ప్రయాణికులపై భారం మోపడం మాత్రం సులభతరంగా మారింది. ఉమ్మడి విజయనగరం అసలే ఆర్థికంగా వెనుకబడిన జిల్లా. విద్య, వైద్య సదుపాయాలు అంతంతమాత్రమే. ఉపాధి అవకాశాలు కరువే. దీంతో, ప్రతి చిన్నపనికీ, సమస్యకీ, పక్కనేవున్న విశాఖ జిల్లాపై ఆధారపడాల్సిన దుస్థితి. చాలా కాలంగా వున్న నాతవలస టోల్‌గేట్‌తో చాలా మంది ప్రయాణికులు అదనపు ఛార్జీలు చెల్లించుకోవాల్సి వస్తోంది. తాజాగా విజయనగరం - విశాఖ జాతీయ రహదారిలో జొన్నాడ వద్ద ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాతో బస్సులో ప్రయాణించే సగటు మనిషి విశాఖ వెళ్లిరావాలంటే కనీసం రూ.20 వరకు అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విజయనగరం నుంచి విశాఖ వెళ్లే ప్రతి బస్సుకూ రానూపోనూ రూ.295 చెల్లించుకోవాల్సి వస్తోంది. దీంతో, ఇటీవల కాలం వరకు రూ.90 ఉన్న అల్ట్రా డీలక్స్ ఛార్జీ రూ.100కు పెరిగింది. సూపర్ లగ్జరీ ఛార్జీ రూ.100 నుంచి రూ.110కి పెరిగింది. ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు ప్రస్తుతం రూ.75 చెల్లిస్తుండగా, రూ.80కి, పల్లె వెలుగు బస్సు ఛార్జీలు రూ.60 నుంచి రూ.70కి పెరిగాయి. ఇంకా విశాఖ డిపో బస్సులపైనా ఇదే తరహా భారం ఉంటుంది. దీన్నిబట్టి విజయనగరం నుంచి విశాఖ వెళ్లి వచ్చే ప్రయాణికుడిపై రూ.20భారం పడుతోంది. ఇక కారులు, వ్యానులు, లారీలు, ఇతర వాహనాలకు ఇంత కన్నా ఎక్కువ మొత్తంలోనే వసూలు చేస్తున్నారు. ఇది కూడా కేవలం విజయనగరం నుంచి విశాఖ వెళ్లే ప్రయాణికులపై పడుతున్న భారం. ఇది చాలదన్నట్టు మానాపురంలో మరో టోల్‌గేట్ రెడీ అవుతోంది. త్వరలోనే దీన్ని ప్రారంభించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతుతున్నాయి. మానాపురానికి ముందు బస్సు ఎక్కే ప్రయాణికులపై రాను పోను రూ.20 అదనపు భారం. వీరు విశాఖ వెళ్లాలంటే మొత్తంగా రూ.40 వరకు అదనంగా ఆర్థికభారం మోయాల్సివుంటుంది. ఇటు ఎస్.కోట నుంచి విజయనగరం వచ్చే ప్రయాణికులకూ టోల్ ఛార్జీ వడ్డన తప్పే పరిస్థితి లేదు. విజయనగరం నుంచి బొడ్డవర వెళ్లే మార్గంలో తామరాపల్లి వద్ద కూడా మరో టోల్‌గేట్ రెడీ అవుతోంది. దీన్నిబట్టి ఎటు నుంచి ఎటెల్లినా జిల్లా వాసులకు టోల్ ఛార్జీలు తప్పే పరిస్థితి లేదు. మొత్తం టోల్‌గేట్లలో మూడుచోట్ల డబుల్ ఇంజిన్ (కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బిజెపితో కూడిన కూటమి ప్రభుత్వం) సర్కారు వచ్చాక ఏర్పాటు చేస్తున్నవే కావడం విశేషం. వాస్తవానికి విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో పెద్దగా విద్య, వైద్యం

సదుపాయాలు పెద్దగా లేవు. సూపర్ స్పెషాలిటీ వైద్యం కావాలన్నా, ఇతర అవసరాలకు విశాఖపట్నం వెళాల్సిందే. జిల్లా వాసులు కాస్త అటవిడుపుగా సేదదీరాలనుకున్నా విశాఖ అందాల కోసం వెళ్లాల్సిందే. ఈనేపథ్యంలో విజయనగరం, విశాఖ జంట నగరాలుగా ఉన్నాయి. ఎంతో మంది ఉద్యోగులు, వ్యాపారులు, అధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈనేపథ్యంలో కేవలం బస్సు ప్రయాణికులు మాత్రమే కాకుండా కార్లు, వ్యానులు, లారీలు వంటి అన్నిరకాల వాహనాలపై టోల్ ఛార్జీల భారం పడనుంది. ఇదంతా పరోక్షంగా ప్రయాణికులు, సగటు వినియోగదారులపైనే పడుతుం దనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో టోల్ గేట్లు ఎత్తివేయాలని సిపిఎం, లోక్‌సత్తా డిమాండ్ చేస్తున్నాయి. జొన్నాడ టోల్‌గేట్‌ను తొలగించాలంటూ ఇటీవల విజయనగరం ఎంపీ, ఎమ్మెల్యేలను, కలెక్టర్‌ను కలిశారు. ప్రజాభీష్టం మేరకే టోల్‌గేట్ పై నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎంపీ, ఎమ్మెల్యే చొరవ ఎంత వరకు ఉంటుందో, కలెక్టర్ ఏమేరకు చొరవ చూపుతారో? వేచిచూడాల్సిందే. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో కూడా ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చారు. దీంతో జొన్నాడ టోల్‌గేట్‌ను అక్కడి నుంచి తరలించేందుకు సమావేశంలో తీర్మానం చేశారు. అమలు తీరు ఎలా ఉంటుందో వేచిచూడాల్సిందేనని జనం చర్చించుకుంటున్నారు.

విజయనగరం ఎస్‌పిగా జిందాల్

దీపికా పాటిల్‌కు అనకాపల్లి బదిలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

వకుల్ జిందాల్

జిల్లా ఎస్‌పి ఎం.దీపికా పాటిల్ అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో 2016వ బ్యాచ్‌కు చెందిన వకుల్ జిందాల్ ఎస్‌పిగా నియమితులయ్యారు. బాపట్ల ఎస్‌పిగా ఉన్న ఆయను బదిలీపై ఇక్కడికి రానున్నారు. గతంలో రంపచోడవరంలో ఎఎస్‌పి, సిఎం పర్సనల్ సెక్యూరిటీ వింగ్ ఎస్‌పిగా పనిచేశారు. దీపికా పాటిల్ జిల్లా ఎస్‌పిగా 2021 జులై 12న బాధ్యతలు స్వీకరించి, మూడేళ్ల పాటు సమర్థవంతంగా పనిచేశారు. చింతలవలస వద్దనున్న ఎపిఎస్‌పి బెటాలియన్ కమాండెంట్‌గా మల్లికా గార్గ్ బదిలీపై వస్తున్నారు.

షెడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్న నాయకులు

సంతలో షెడ్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను సంతలో విక్రయించుకునేందుకు షెడ్లు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వరరావు కోరారు. వర్షాకాలంలో కూడా సరుకులు తడవకుండా నిల్వ ఉంచుకునేందుకు ఈ షెడ్లు ఉపయోగపడతాయన్నారు. ఆదివాసి గిరిజన సంఘం నాయకులు బి.చిన్నారావు, ఎస్ రంగారావు ఆధ్వర్యంలో శనివారం సంతల్లో ప్రచారం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ఐటిడిఎ అధికారులు గిరిజన కార్పొరేషన్ జిసిసి చొరవ తీసుకొని అన్ని సంతల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. జిసిసి ద్వారా పంటలు కొనుగోలు చేసే విధంగా ఐటిడిఎ పిఒ చర్యలు చేపట్టాలని షెడ్ల నిర్మాణం చేయాలని కోరారు.

గ్రామ కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి- సీతంపేట

జనసేన పార్టీ మండల అధ్యక్షులు మండంగి విశ్వనాథం ఆధ్వర్యంలో పంచాయితీ గ్రామ కమిటీల ఏర్పాటు చేశారు. పుబ్బాడ పంచాయతీకి సంబంధించి రెండు గ్రామాల నాయకులు, కార్యకర్తలు కలిసి రెండు గ్రామాల కమిటీలు, పంచాయతీ కమిటీ ఏర్పాటు చేశారు. వీటితో పాటు పంచాయతీకి సంబంధించి బడ్జెట్, ఖర్చులు, అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. సమస్యలు పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. మండల ప్రధాన కార్యదర్శి మండంగి నరేష్, కమిటీ నాయకులు పాల్గొన్నారు.

దాసుపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

బ్రాహ్మణులను, బ్రాహ్మణ మహిళలను కించపరుస్తున్న పైలా దాసుపై చర్యలు తీసుకోవాలని పార్వతీపురం బ్రాహ్మణ వైదిక పరిషత్ పెద్దలు వేమకోటి నరహరిశాస్త్రి, వృద్దుల శేషు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఎఎస్‌పి దిలీప్ కిరణ్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ వైదిక పరిషత్ పెద్దలు మాట్లాడుతూ బ్రాహ్మణ కులాన్ని, కులవృత్తిని, బ్రాహ్మణ మహిళలను కించపరుస్తూ అవమానిస్తూ సోషల్ మీడియా ఫేస్బుక్ వేదికగా పోస్టింగులు చేస్తున్న పైలా దాసుపై చర్యలు చేపట్టాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో ఆర్యసోమయాజుల శ్రీరామశర్మ, మురపాక రామదాసుశర్మ, వేమకోటి నాగభూషన్ శర్మ, పాకల సన్యాసిరావు, వేమకోటి మల్లిఖార్జునశర్మ, అంపోలు వాసుదేవశర్మ, పులఖండం ప్రసాద్ శర్మ, తదితరులు ఉన్నారు.

ఎఫ్‌ఆర్‌ఒగా ఎంపికపై అభినందనలు

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండకు చెందిన కె.మణికృష్ణ ఎపిపిఎస్‌సి ద్వారా ఎఫ్‌ఆర్‌ఒగా ఎంపికైనందుకు ఎన్‌కె రాజపురం క్రీడాకారులు, ఇండియన్ పిటి కబడ్డీ క్రీడాకారుడు ఎపి పోస్టల్ స్పోర్ట్స్ బోర్డు మెంబర్ వెన్నపు చంద్రశేఖర్ మణికృష్ణను అభినందించారు. ఇంకా బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కొనియాడారు. కార్యక్రమంలో ఎక్స్ ఆర్మీ సభ్యులు వెన్నపు వెంకటరమణ, యువ నాయకులు వెన్నపు నూతన రంగా, శ్రీరామ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్.భాస్కరరావు, ఎస్.లక్ష్మణరావు, కబడీ క్రీడాకారులు కె.రమేష్, జి.దామోదరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - పాలకొండ

ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన పి.హరిప్రసాద్‌ను అమరావతిలో శనివారం జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు గర్భాన సత్తిబాబు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గంలో సమస్యలను ఆయనకు వివరించారు. తోటపల్లి, జంపరకోట లాంటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్సీ స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు

రూ 7.48 లక్షలకు వేలం

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని 18 షాపులకు గాను 15 షాపులకు వేలంపాట నిర్వహించగా రూ 7.48 లక్షలు వేలం పాట ఖరారైనట్లు పంచాయతీ కార్యదర్శి పి. రాము శనివారం తెలిపారు. గతేడాది కంటే రూ. 72వేలు అదనంగా ఆదాయం చేకూరినట్లు ఆయన తెలిపారు.

చెరువును తలపిస్తున్న పాఠశాల ఆవరణ

పలుచోట్ల కుండపోత వర్షం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని శనివారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న కాలువల నీరు రహదారిపైకి పొంగిపొర్లింది. దీంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జిల్లా పరిషత్ బాలుర బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వర్షం నీటితో చెరువును తలపించింది.

సీతంపేట: మండలంలో శనివారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రంగా ఎండ కాసినప్పుడికీ మధ్యాహ్నం సమయంలో ఒకసారి మేఘాలు చిమ్మ చీకటిగా మారి వాతావరణం చల్లబడి ఒకసారిగా 12 గంటల నుండి ఒంటి గంటన్నర వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుండపోత వర్షం కురవడంతో ఆకు తయారు చేయడానికి ఉపయోగ పడుతుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

నేడు జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

17 వ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ఆదివారం తోటపాలెంలోని గాయత్రి విద్యాసంస్థల్లో జరుగుతాయని జిల్లా తైక్వాండో అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సి హెచ్ వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ప్రారంభిస్తారని తెలిపారు. సాయంత్రం ముగింపు, బహుమతి ప్రధాన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి.శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు.

లారీని లాగుతూ సిపిఎం నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

రోడ్డులో కూరుకుపోయిన లారీని తాడుతో లాగి నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

మండల కేంద్రంలో అంతర్ రాష్ట్ర రహదారిపై గోతుల్లో శనివారం లారీ దిగిపోయింది. దీంతో సిపిఎం ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లు వినూత్న రీతిలో లారీకి తాడు కట్టి లాగుతూ నిరసన తెలిపారు. రెండు రోజుల్లో మరమ్మతు పనులు చేపట్టకపోతే ఈ ఆందోళన ఉధృతం చేసి రోడ్డును మూసివేసే విధంగా కంచె కట్టేస్తామని స్థానిక హెచ్చరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ ఏ గోతుల్లో లారీలు దిగిపోయి అనేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా రోడ్ల మరమ్మతులకు గురైనట్లు చెబుతూ నిరసనలు తెలిపినా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీంతో చిన్న చినుకు పడినా గోతుల్లో లారీలు, కార్లు దిగిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శుక్రవారం రాత్రి 8గంటల సమయంలో మండలకేంద్రానికి సమీపంలో రెండు లారీలు రోడ్డుకు పడ్డ గోతుల్లో దిగపడిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయిందన్నారు. దీంతో సిపిఎం ఆధ్వర్యంలో దిగిపోయిన లారీకి తాడు కట్టి నిరసన తెలిపామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దారుణంగా మారిన అంతర్ రాష్ట్ర రహదారిని మరమ్మత్తులు చేసి వాహనదారుల కష్టాలు తీర్చి ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించాలని కోరారు.

రూ.50 ఇచ్చుకో.. ఇకెవైసి చేసుకో

ఇండియన్ గ్యాస్ సిబ్బంది నిర్వాకం

ప్రజాశక్తి - మక్కువ

తూరుమామిడిలో ఇకెవైసి చేస్తున్న ఏజెన్సీ సిబ్బంది

ప్రభుత్వం పేద ప్రజలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం ప్రారంభించబోతున్న తరుణంలో గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులను నిలువు దోపిడీకి గురిచేస్తున్నారు. ఇకెవైసి రూపంలో సాలూరు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది గ్రామాల్లో తిరుగుతూ ప్రతి ఒక్కరి నుండి రూ.50 వసూలు చేస్తున్నారు. ఇకెవైసి చేయకపోతే గ్యాస్ బండలు రావేమోనని మహిళలంతా ఆందోళన చెందుతూ ఇకెవైసి కోసం రూ.50తో క్యూకడుతున్నారు. వాస్తవానికి గ్యాస్ ఏజెన్సీలు ఉచితంగా వినియోగదారులకు ఇకెవైసి సౌకర్యం అందించాల్సి ఉన్నప్పటికీ ఖర్చుల కోసం అంటూ వసూలు చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ బండలు గ్రామాలకు తెచ్చేటప్పుడు కూడా అధిక ధర వసూలు చేస్తున్నారని కూడా ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

జయకృష్ణ గెలుపు వెనుక 'కర్నేన'

ప్రజాశక్తి-పాలకొండ



నియోజకవర్గంలో ఎన్‌డిఎ కూటమి ఎమ్మెల్యే నిమ్మక జయకష్ణ గెలుపు వెనుక ఎందరో కృషి ఉందని చెప్పవచ్చు. టిడిపి నాయకత్వంతో పాటు, జనసేనలో యువత ప్రభావంతో పాటు జయకృష్ణపై ప్రజల్లో ఉన్న మంచి అభిప్రాయం ఈ విజయానికి కారణమైందని ప్రజలు చర్చించుకుంటున్నారు. టిడిపిలో ఉన్నప్పటి నుండి జయకష్ణ వెనుక ఉండి ఆయన గెలుపుకు పునాదులు వేసిన కర్నేన అప్పలనాయుడుకు మంచి గుర్తింపే వచ్చిందని చెప్పుకోవచ్చు. 2010లో టిడిపిలో చేరిన అప్పల నాయుడును మొదటి నుంచి ఒక గ్రూపు వ్యతిరేకిస్తూ వచ్చినా ఎక్కడా కూడా ఆయన వెనకడుగు వేయకుండా తన పని తాను చేసుకుంటూ పోయారు. 2014లో టిడిపి అభ్యర్థిగా ఉన్న జయకృష్ణకు వెన్నంటి ఉన్నప్పటికీ ఆ ఎన్నికల్లో ఆయన 1600 ఓట్లతో ఓటమి పాలయ్యారు. అయినా అప్పలనాయుడు మాత్రం మాజీ మంత్రి కళా వెంకట్రావు వ్యక్తిగా ముద్ర వేసుకొని పార్టీ బలోపేతానికి ప్రయత్నాలు చేశారు. 2019లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన జయకృష్ణకు ఒక గ్రూపు పూర్తి వ్యతిరేకంగా పని చేసినప్పటికీ, అప్పలనాయుడు మాత్రం జయకృష్ణ వెంటే ఉండి తనదైన శైలిలో రాజకీయాలు నడిపారు. కానీ రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి గాలి వీయడంతో జయకృష్ణ ఓటమి చెందారు. ఆ తరువాత అసమ్మతి వర్గాన్ని పక్కన పెట్టి మిగిలిన కేడర్‌తో అప్పలనాయుడు సమన్వయం చేసు కుంటూ తన పని తాను చేసుకున్నారని తెలుస్తుంది. 2024లో టిడిపి టికెట్ విషయంలో కూడా జయకృష్ణకు ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ ఆయన జనసేనలో చేరి టికెట్ సంపాదించుకునే విషయంలో అప్పలనాయుడు కీలక భూమిక పోషించారని ఆ పార్టీలో నేతలే చెప్పుకుంటున్నారు. పాలకొండ, వీరఘట్టం మండలాల్లో టిడిపిలో జయకృష్ణకు వ్యతిరేకంగా ఉన్న వర్గీయులు ఆయన ఓటమికి ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ కూడా జనసేనకు మెజార్టీ రావడంలో అప్పలనాయుడు తన రాజకీయ చతురత చూపించి కృషి చేశారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నదులపై వంతెనలు నిర్మించాలి

ప్రజాశక్తి - కొమరాడ

కోటిపాం, సీతానగరం గ్రామాల వద్ద ఉన్న నదులపై కొత్త రవాణా బ్రిడ్జిలు నిర్మించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు. శనివారం కోటిపాం గ్రామాల వద్ద ఉన్న పాత రవాణా బ్రిడ్జిలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో సీతానగరం, కోటపాం గ్రామాల వద్ద నదులపై ఉన్న రవాణా బ్రిడ్జిలు పురాతణమైనవని అన్నారు. ఈ బ్రిడ్జిలు కూడా బ్రిటిష్ వారి హయాంలో నిర్మించినవని, ఎక్కువ కాలం మన్నికలో ఉండడం వల్ల బలహీన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. విశాఖపట్నం, విజయనగరం నుంచి ఈ బ్రిడ్జల మీదుగానే ఒరిస్సా, మధ్యప్రదేశ్‌కు భారీ వాహనాలు ప్రయణిస్తాయని, కాలం చెల్లిని బ్రిడ్జిలను ఇంకా వాడుకలో ఉండడం శ్రేయస్కరం కాదని అభిప్రాయ పడ్డారు. పాత బ్రిడ్జులు కావడంతో భారీ వాహనాలు వెళ్లేటప్పుడు ఇబ్బందికరంగా ఉంటుందని చెప్పారు. ఈ రెండు గ్రామాల వద్ద నదులపై పాత బ్రిడ్జి ల పక్కన కొత్త రావణా బ్రిడ్జిలను నిర్మించి ప్రజా రావణాకు ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త బ్రిడ్జిలు నిర్మించే వరకూ సిపిఐ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమిస్తామన్నారు.

అభివృద్ధికి తోడ్పాటు :మంత్రి

ప్రజాశక్తి - మక్కువ

సూర్యనారాయణను పరామర్శిస్తున్న మంత్రి

రాష్ట్రంలో ఉన్న శిష్టికరణాలు, కళింగ వైశ్యుల కుటుంబాల అభివృద్ధికి టిడిపి ప్రభుత్వం తోడ్పాటు ఉంటుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం సాలూరులోని మంత్రి నివాసంలో మక్కువ టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావు నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన కళింగ వైశ్యులు, సిష్టి కరణాలంతా కలిసి మంత్రిని అభినందించి సన్మానించడంతో పాటు వీణ బహూకరించారు. మావుడి ప్రసాద్‌రావు నాయుడును కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంపటాపు స్వామినాయుడు, బి వాసుదేవరావు, పి మల్లేశ్వరరావు, సెల్లా వెంకటరమణ, వివిధ గ్రామాలకు చెందిన కళింగ వైశ్యులు, సిష్టి కరణాలు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సూర్యనారాయణకు మంత్రి పరామర్శ

పాచిపెంట: రాష్ట్ర శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి టిడిపి రాష్ట్ర కార్యదర్శి ముఖీ సూర్యనారాయణను పరామర్శించారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై గత 20 రోజులుగా విశాఖపట్నం ప్రైవేట్ హాస్పటల్లో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న ఆయనను ఆమె శనివారం స్వగ్రామం మాతుమూరు వెళ్లి పరామర్శించారు. ఆమె వెంట పాచిపెంట, సాలూరు మండలాల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు, ఆముదాల పరమేష్, గూడెపు యుగంధర్, చల్లా కనకారావు, పూసర్ల నర్సింగరావు, పల్లెడ ఉమా, కొత్తల పోలినాయుడు తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి జనసేన సాయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఆర్థిక సాయం అందిస్తున్న జనసేన నాయకులు

పట్టణంలోని 12వ వార్డులో నివాసం ఉంటున్న బెహరా సురేష్ అనే యువకుడు రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయన భార్య, ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలిపోయారు. అదే వార్డులో ఉన్న జనసేన నాయకులు రెడ్డి నాగరాజు, వహాబ్ ఈ విషయాన్ని మిగిలిన నాయకులు తెలిపారు. దీంతో పట్టణంలోని జనసేన కార్యకర్తలు స్పందించి శనివారం సురేష్ ఇంటికి వెళ్లి నిత్యవసర సరుకులు, గ్యాస్ బండ, కొంత నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు చందక అనిల్ మాట్లాడుతూ తమ అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆదేశాలు మేరకు మృతుని కుటుంబానికి జనసేన అండగా నిలబడడం సంతోషదాయకమన్నారు. సురేష్‌కు సొంత ఇల్లు కూడా లేదని, అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నారని, వారికి ఇల్లు మంజూరు చేయాల్సిందిగా ఎమ్మెల్యే విజయ్ చంద్ర దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అలాగే ఆ కుటుంబానికి ఏ అవసరం వచ్చినా ప్రభుత్వం తరపున సహాయం కావాలన్నా ఆదుకుంటామని అన్నారు. కార్యక్రమంలో సిరిపురపు గౌరి, మానేపల్లి ప్రవీణ్, భమిడిపాటి చైతన్య, కడగల శ్యాంసుందర్, యాసిన్ బాబా, బ్రమ్మాజీ, ఎడ్ల నరేష్ , గణేష్ జనసేన, టిడిపి, బిజెపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

వైద్యులతో మాట్లాడుతున్న పడాల భూదేవి

పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని శనివారం సందర్శిచారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావుతో కలిసి వార్డుల్లో తిరిగి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో వారికి అందుతున్న వైద్యసదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే నూతనంగా నిర్మాణం అవుతున్న ఆసుపత్రి రెండో బ్లాక్ భవన నిర్మాణాల పనులను ఆమె పరిశీలించారు. ఈ సీజన్‌లో విషజ్వరాలు ఎక్కువగా పొంచివున్నందున అప్రమత్తంగా ఉండాలని, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో బాల బాలికలకు రక్తపరీక్షలు నిర్వహించాలని సూపరింటెండెంట్‌ను కోరారు. అలాగే డిప్యూటీ డిఎంఅండ్ హెచ్‌ఒ పోస్ట్ ఖాళీగా ఉందని సిబ్బంది చెప్పారు. పాము కాటు, రాబిస్ మందులు అందుబాటులో ఉంచాలని కోరగా, మందుల కొరత లేదని సూపరింటెండెంట్ వివరించారు. అలాగే గ్రామాల్లో విరివిగా వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆమె కోరారు.

చెరకు సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

మాట్లాడుతున్న పట్టాభిరామిరెడ్డి

చెరుకు సాగులో మెలకు వలతోనే అధిక దిగుబడులు వస్తాయని ప్రొఫెసర్ ఎవిపి పట్టాభిరామిరెడ్డి అన్నారు. మండలంలోని కామన్నదొరవలస పంచాయతీ వెంకటాపురంలో శనివారం సంకిలి ప్యారిస్ యాజమాన్యం ఆధ్వర్యంలో చెరుకు రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సులో ఆయన మాట్లాడుతూ కొత్తరకం చెరుకు వంగడాలను వాడితే ఎకరాకు 60 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు. రైతు నూతన పద్ధతులతో చెరుకు విస్తీర్ణం పెంచితే కావాల్సిన రాయితీలు, సబ్సిడీలు యాజమాన్యం అందజేస్తుందన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం చెప్పిన పద్ధతిలో సాగు విస్తీర్ణాన్ని పెంచి రైతులు రాయితీలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో సంకిలి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధులు ఎవిపి సుందరం, జె.రమేష్, రవీంద్రతో పాటు కామన్నదొరవలస, లక్ష్మీపురం, బూర్జ గ్రామాలకు చెందిన చెరుకు రైతులు పాల్గొన్నారు.

వైభవంగా రథయాత్ర

ప్రజాశక్తి - పాలకొండ

ఈనెల 7 నుంచి ప్రారంభమైన జగన్నాథస్వామి రథాఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పాలకొండ పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి యాత్రికులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. దేవాదాయ శాఖ అధికారులు అన్ని సౌకర్యాలను కల్పించారు. వినోదభరిత కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి సర్వేశ్వరరావు మాట్లాడుతూ యాత్ర వైభవంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆలయానికి ఈసారి రంగులు కూడా వేశామని, యాత్ర నిర్వాహణకు అయ్యే ఖర్చు యాత్రలో వివిధ రూపాల్లో సమకూర్చుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

రోడ్డు పూర్తి చేయాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న గిరిజనులు

తమ గ్రామాలకు రోడ్డు నిర్మాణాలు పూర్తిచేయాలని కోరుతూ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి గిరిజనులు వినతి పత్రం అందించారు. మండలంలోని లోవముఠా ప్రాంతమైన డబ్బలగూడ నుంచి ఇజ్జకాయి గ్రామానికి మూడు కిలోమీటర్ల బీటీ రోడ్డు, గొయిపాక నుంచి ఇజ్జకాయి గ్రామానికి ఏడు కిలోమీటర్లు రోడ్లు నిర్మించాలని గిరిజనులు కోరారు. గతంలో పిఎంజిఎస్‌వై నిధులతో రోడ్లు మంజూరయ్యేవని ఆ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సమస్య విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి రోడ్లు నిర్మాణాలు పూర్తికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు యువరాజ్, గోయిపాక బీరుపాడు యువత పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యుఐ ఆధ్వర్యాన తరగతుల బహిష్కరణ

విజయనగరం టౌన్ : నగరంలో సెలవు రోజు శనివారం తరగతులు నిర్వహిస్తున్న ఆదిత్య డిగ్రీ కాలేజీ, ఎజిఎల్ డిగ్రీ కాలేజీ చైతన్య డిగ్రీ కాలేజీలో ఎన్‌ఎస్‌యుఐ ఆధ్వర్యాన విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుంకరి గణేష్ ఆధ్వర్యాన ఆయా కళాశాలలకు వెళ్లి విద్యార్థులను బయటకు పంపించారు. ఆయన మాట్లాడుతూ ఇకపై ఏ విద్యాసంస్థలైనా ప్రభుత్వ సెలవు దినాల్లో క్లాసులు నిర్వహిస్తే విద్యార్థులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- సీతంపేట

బీజామృతంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పులిపుట్టి పంచాయతీ పరిధిలో గల వేంపలగూడ గ్రామంలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో రిసోర్స్‌పర్సన్ పాలక నాగేశ్వరావు, చిరంజీవులు మాట్లాడుతూ బీజామృతం తయారు గూర్చి చెప్పి దాని ఉపయోగములు గురించి వివరించారు. రసాయనిక మందులు బదులుగా ఘనజీవామృతం, ద్రవజీవామృతం తయారు చేసి పంటలకు ఉపయోగించడం వల్ల ఖర్చులు తగ్గి ఆరోగ్య వంతమైన పంటలు పండించవచ్చు అని చెప్పారు. పురుగు మందులు బదులుగా నీమస్త్రం, పంచ పత్ర కాషాయం, వాయులాకు కాషాయం, ఉపయోగించి పురుగులు, తెగుళ్ల నివారణ చేయవచ్చునన్నారు. వరిలో తెగుళ్ల నివారణకు గట్లపై బంతి, ఆముదం, కంది పంటలు వెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో వేంపలగూడ, సుందరయ్యగూడ, రేగులగూడ గ్రామాలు నుంచి 35 మంది రైతులు, ఏరియా కోఆర్డినేటర్ వసంత, సిఒఎస్ లావణ్య, పార్వతి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

గండి పూడ్చివేతను పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రసాద్

ఎట్టకేలకు గండి పూడ్చివేత

ప్రజాశక్తి -భామిని

మండలంలోని గురండిలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతిలో గురువారం ఒక లారీ, శుక్రవారం మరొక లారీ దిగబడడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు, స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు తీవ్ర అవస్థలుపడ్డారు. ఈ మేరకు శనివారం బత్తిలి ఎస్ఐ సిహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు, నాయకులతో కలిసి ఆ గొయ్యిని పూడ్చారు. వర్షం పడ్డా వాహన రాక పోకలకు ఇబ్బందిలేకుండా మెటల్ రాయితో పూడ్చారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. అలాగే కొత్తూరు నుండి బత్తిలి వరకు గల ప్రధాన రహదారి అంతా గోతులమయమైంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఈ రోడ్డు మరమ్మతులు తక్షణమే పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్యులపై ఆరోపణలు తగదు

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని దోనుబాయి పిహెచ్‌సి వైద్యాధికారి భానుప్రతాప్‌పై కొంతమంది చేసిన ఆరోపణలు సరికాదని మన్యం జిల్లా వైద్యాధికారులు తెలిపారు. ఈ మేరకు శనివారం డిఎస్‌పి జివి కృష్ణారావును కలిసి ఈ సమస్యలను వివరించారు. వైద్య సిబ్బందితో కలిసి ఒక వ్యక్తి బ్లాక్ మైల్ చేయిస్తున్నారని ఆరోపించారు. దీనిపై న్యాయ విచారణ జరపాలని, వైద్యులపై తప్పుడు కేసులు పెట్టడం సరికాదని అన్నారు.

బొడ్డగూడలో స్టాప్ డయేరియా

ప్రజాశక్తి -భామిని

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సోయల్

వర్షాకాలంలో పరిశుభ్రమైన ఆహారం, నీరు తీసుకోవాలని స్థానిక పిహెచ్‌సి వైద్యులు పసుపులేటి సోయల్ తెలిపారు. బొడ్డగూడలోని ప్రాథమిక పాఠశాలలో వైద్య సిబ్బంది స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డయేరియా లక్షణాలు, డయేరియా రాకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలు పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భామిని సిహెచ్‌ఒ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గాయపడిన వర్మ

పట్టణం ప్రధాన రహదారిపై శనివారం ద్విచక్ర వాహనాన్ని లారీ వెనుక నుంచి ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. పార్వతీపురం పట్టణానికి చెందిన కెకెఎస్‌ఆర్‌ఎ వర్మ ఎలక్ట్రానిక్ మీడియాలో రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం తన దిన చర్యలో భాగంగా తన ద్విచక్ర వాహనంపై పాత బస్ స్టాండ్ వైపు వెళుతుండగా, ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గరలో వెనుక నుంచి ఒక భారీ లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ బైకును ఢీకొట్టడంతో వర్మ తలకు గాయమైంది. స్పందించిన స్థానికులు పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం విజయనగరం తరలించారు. పోలీసులు ఈ ఘటనపై విచారణ చేపడుతున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం మండలం సూడిగం గ్రామానికి చెందిన తుమరాడ గౌరు నాయుడు శనివారం తన బంధువులతో జరిగిన ఆస్తి తగాదా వల్ల మనస్థాపం చెంది ఇంట్లో ఉన్న కలుపు మందు తాగి ఆత్మహత్యాకు పాల్పడ్డాడు. స్పందించిన కుటుంబీకులు 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.